

# పాఠం

యం.వి. కిషన్

"ఇవ్వాల్టికి ఫిజిక్సింక చాలు. కాసేపు ఇంగ్లీషు చెప్పుకుందాం, మురారీ. ఇంగ్లీషు టెక్స్టుందా?" అడిగారు మూర్తిరాజుగారు.

"నే తేలేదు, సార్!" అని అటూ ఇటూ చూసి, "ఇదిగోండి, సార్, మోహన్ దగ్గరుంది..." అంటూ మోహన్ ముందున్న ఇంగ్లీషు టెక్స్ట్‌ని చటుక్కున అందుకుని మాస్టారి కందించబోయాడు మురారి.

"మురారీ...ప్లీజ్...వద్దు..." అంటూ కంగారుగా మురారిని పట్టు పుచ్చుకొని వెనక్కి గుంజాడు మోహన్. కానీ, లాభం లేకపోయింది. ఆనరికే ఇంగ్లీషు టెక్స్ట్ మాస్టారి చేతిలోకి వెళ్ళిపోయింది.

నాగుపాము కాళ్ళకు చుట్టుకున్న వాడిలా బెంబేలెత్తిపోతున్న మోహన్‌కేసి విస్మయంగా చూశారు మూర్తిరాజుగారు. "వాటీజ్ ఇట్, మోహన్? వాటీజ్ రాంగ్?!"

"ఏం లేదు, సార్! ఏం లేదు. ఆ టెక్స్ట్...అది...అది నాది కాదు. మా క్లాస్‌మేట్‌ది. దాన్ని...దాన్నిచ్చేయండి, సార్!" ఎందుకోగాని పూర్తిగా తడబడిపోయాడు మోహన్.

"వాటీఫ్?...ఎవరిదైతే ఏం పోయింది? పాఠం చెప్పేశాక ఇచ్చేస్తానుగా?"

"అదికాదు, సార్...అదీ...అదీ...ప్లీజ్, సార్!...ఆ పుస్తకాన్నిచ్చేయండి, సార్!" అంటూ లేచి మాస్టార్ని సమీపించబోయాడు మోహన్.

'దేరీజ్ సమ్‌థింగ్ రాంగ్' అనుకున్నారు మూర్తిరాజుగారు. "ఆగు!" అన్నారు గద్దింపుగా. వినిపించుకోలేదు మోహన్. ఆయన చేతిలోంచి విసురుగా ఆ పుస్తకాన్ని లాక్కున్నాడు. ఆ విసురుకి అందులోంచి ఓ కాగితం రాలి సరిగ్గా ఆయన ఒడిలో పడింది. అది గమనించుకోని మోహన్ యథాస్థానంలోకి వెళ్ళి కూర్చున్నాడు. గమనించిన మూర్తిరాజుగారు దానికోసమే మోహన్ అలా ప్రవర్తించి ఉంటాడేమో అనిపించి గబుక్కున దాన్నందుకుని చటుక్కున పేంటుజేబులో పెట్టేసుకున్నారు. విద్యార్థులందరూ మోహన్‌కేసి, మాస్టారుకేసి మార్చి మార్చి చూస్తున్నారు.

ఆడపిల్లల వరసలో కూర్చున్న మోహన్ చెల్లెలు అనూరాధక్కూడా అన్నగారి ప్రవర్తనేమీ అర్థం కాలేదు. అందరితోపాటు ఆమె కూడా అయోమయంలో పడింది.

"మోహన్! నే నొచ్చేవరకూ నువ్వెళ్ళిపోవద్దు ...మురారీ, రంగా, మోహన్‌ని వెళ్ళిపోనివ్వద్దు..." అంటూ లేచి లోపలికి వెళ్ళారు మూర్తిరాజుగారు.

విషయం అర్థంకాక అందరి బుర్రల్లోనూ ప్రశ్నార్థకాలు.

మాస్టారు లోపలికి వెళ్ళగానే చటుక్కున ఇంగ్లీషు టెక్స్ట్ తెరిచి దేనికోసమో ఆత్రతగా వెదుక్కొన్నాడు మోహన్. అందులో ఉండాల్సిన కాగితం కనబడకపోయేసరికి అతని గుండెలో రైళ్ళు పరుగులు తీశాయి.

మోహన్‌నే నిశితంగా పరిశీలిస్తూ ఉన్న మురారీ, రంగాలు "ఏరేంట్రా మోహన్, ఏమైంది?" అన్నారు ముక్తకంఠంతో.

"కొంప మునిగింది" అని మెల్లగా గొణిగి లేచి నిలబడ్డాడు మోహన్.

"ఎక్కడికిరా, మోహన్...మస్టారు వెళ్ళొద్దన్నారుగా?" అని రంగా అంటున్నా కూడా వినిపించుకోకుండా వెళ్ళిపోవడానికి ఉద్యుక్తుడయ్యాడు. కానీ, నాలు గడుగులకు మించి వెయ్యలేకపోయాడు. ఎందుకంటే, మురారీ, రంగా లిద్దరూ కలిసి అతణ్ణి ఒడిసి పట్టుకున్నారు.

"వదలండి...నన్నొదలండిరా..." అని గింజుకోసాగాడు మోహన్. కానీ, వా ళ్ళతని ప్రయత్నాన్ని వడనివ్వలేదు. "మస్టారు నిన్ను వెళ్ళనివ్వద్దన్నారు. వెళ్ళనివ్వం- అంతే!" అంటూ మరింత గట్టిగా చేతుల్లో బంధించేశారు. మోహన్ వాళ్ళని గోళ్ళతో రక్కాడు. అయినా, ఓర్చుకున్నారు.

"ఒరేయ్! నన్నొదలకపోతే మీ అంతు చూస్తాన్రా!" అని ఆవేశంగా అరిచాడు మోహన్.

"ఏడిశావ్!" అన్నారు మురారీ, రంగాలు. వాళా మాట అంటుండగా మూర్తిరాజుగారు లోపల్నుండి బయటికి రానే వచ్చారు. మురారీ, రంగాల చేతుల్లో గింజాకుంటున్న మోహన్ని చూసి జరిగిందేమిటో ఊహించుకోగలిగారు.

"మోహన్...బి క్వయిట్! భయపడొద్దు...నిన్నేం అన్ను. వెళ్ళి నీ ప్లేసులో కూర్చో" అన్నారు వాళ్ళ చెంతకు వెళ్ళి.

మోహన్ తల దించుకున్నాడు. మనిషి నిలువెల్లా కంపించిపోతున్నాడు. మూర్తిరాజుగారు మోహన్ భుజం మీద 'భయంలే' దన్నట్టుగా తట్టారు. "ఏమరేం ఫర్వాలేదు. వెళ్ళి కూర్చో..."

మురారీ, రంగాలు మోహన్ని వదిలి తమ స్థానాల్లోకి వెళ్ళి కూర్చున్నారు.

"ఊఁ, నువ్వు కూడా వెళ్ళి కూర్చో!" అని మూర్తిరాజుగారు మరో మారు హెచ్చరించాక తప్పనిసరై కదిలాడు మోహన్.

మోహన్ వెళ్ళి కూర్చున్నాక మూర్తిరాజుగారు కూడా వెళ్ళి తన కుర్చీలో కూర్చున్నారు.

విద్యార్థు లందరి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తోన్న కుతూహలాన్ని గమనించి-"దేరీజ్ నథింగ్ రాంగ్! ఊఁ...డిగ్రీ బాచ్ వాళ్ళంతా ఇంగ్లిష్ టెక్స్టు తెరవండి. ఇంటర్ వాళ్ళు నే నిచ్చిన లెక్కలు చెయ్యండి" అంటూ ఆర్డర్ వేసి, మోహన్ పక్కనే ఉన్న మరో విద్యార్థి దగ్గర్నుంచి ఇంగ్లీషు టెక్స్టు అడిగి తీసుకుని పాఠం మొదలు పెట్టారుమూర్తిరాజుగారు.

అది క్లాసు రూమ్ కాదు.

మూర్తిరాజుగారి స్వగృహం.

మూర్తిరాజుగారికి మంచి లెక్చరర్గా వాళ్ళ కాలేజీలో గొప్ప పేరుంది. కావడానికాయన ఫిజిక్స్ లెక్చరర్ అయినా డిగ్రీలో యూనివర్సిటీ ఫస్టు వచ్చిన కాండిడేట్ కావటంవల్ల మిగతా సబ్జెక్స్టు అన్నింటి మీద కూడా ఆయనకి మంచి అథారిటీ ఉంది. అందుచేత ఆయన డిగ్రీ వాళ్ళకీ, ఇంటర్ వాళ్ళకీ ఫిజిక్స్, లెక్కలు, కెమిస్ట్రీ, ఇంగ్లీషుల్లో ట్యూషన్స్ చెబుతుంటారు-బయలాజికల్ సైన్సెస్, కామర్సు ఆయన డిగ్రీలో చదివినవి కాకపోయినా స్వతహాగా మేధావి గనుక ఆ సబ్జెక్టుస్ కూడా అనర్గళంగా చెప్పగల రాయన. అందుచేత ఆయా గ్రూపులకు చెందిన వాళ్ళు కూడా ఇంగ్లీషు చెప్పించుకునే నెపంతో ఆయన వద్ద ట్యూషన్కి చేరి, ఆయా సబ్జక్టులు కూడా చెప్పించుకుంటూ ఉండటం కద్దు. మూర్తిరాజుగారి వద్ద ట్యూషన్ చెప్పించుకుంటే ఫెయిల్ కావడమంటూ ఉండదని ఇటు విద్యార్థుల్లోనూ, అటు తల్లితండ్రుల్లోనూ గట్టి నమ్మకం. నిజానికది కేవలం నమ్మకం మాత్రమే కాదు. జరిగేది కూడా అదే! అందుకే మూర్తిరాజుగారి ఇల్లెప్పుడూ పొద్దున్న, సాయంత్రం ట్యూషన్ల కొచ్చే విద్యార్థుల్తో కిటకిటలాడిపోతూ ఉంటుంది. లెక్చరర్గా ఆయన కొచ్చే జీతం కన్నా ట్యూషన్ల మీద వచ్చే రాబడి నాలుగింతలు! నందు దొరికినప్పుడల్లా "మీకేమిటండీ, రెండు చేతులా సంపాదిస్తున్నారు. అదృష్టవంతులు" అంటూ తోటి లెక్చరర్లు అంతా ఆయన ముఖం మీదే తమ ఈర్ష్యను వెళ్ళగక్కుతూ ఉంటారు.

రాత్రి ఎనిమిదిన్నర అవుతుండగా ఆ నాటికి ట్యూషన్ ముగించారు మూర్తిరాజుగారు. అందరితోపాటు మోహన్ కూడా లేచి వెళ్ళిపోబోతుంటే "నువ్వు, అనూరాధ కాసేపుండండోయ్! నీతో కొంచెం మట్లాడాలి!" అన్నారు మూర్తిరాజుగారు.

మోహన్ గుండె దడదడలాడింది. 'తప్పిపోయిం దనుకున్న విపత్తు మళ్ళీ ఇంతలోనే తలమీద పడిందా, భగవంతుడా'అనుకుని లోలోన వణికిపోయాడు. 'అయినా, తన పిచ్చిగాని, అంత సీరియస్ వ్యవహారం మరీ ఇంత తేలికగా పోతుందా? చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదు. సరే...జరిగేదేదో జరక్క మానదు. భయపడి ప్రయోజనం ఏమిట్లే' అనుకుని అంతలోనే ఒకింత ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు.

అందరూ వెళ్ళిపోయాక "అనూరాధా! నువ్వు కాసేపు ఈ వరండాలో కూర్చోమ్మా. మీ అన్నయ్యతో కొంచెం మట్లాడాలి" అని మోహన్ చెల్లెలితో చెప్పి "నువ్వు నాతో రావోయ్" అంటూ మోహన్ని లోనికి నడిపించుకు వెళ్ళారు మూర్తిరాజుగారు.

కసాయివాడి వెంట మరి కాసేపట్లో చావబోతున్న మేక నడిచినట్టు మస్టారి వెంట నడిచాడు మోహన్.

డ్రాయింగ్ రూమ్లోకి తీసుకెళ్ళి మోహన్ని కూర్చో బెట్టారు మూర్తిరాజుగారు.

పేంటు జేబులోంచి ఓ కాగితాన్ని బయటికి తీసి మోహన్కి అందించారు. "ఊఁ...చదువు" అన్నారు సౌమ్యంగా.

మోహన్ ముఖంలో కత్తివేటుకి నెత్తుటి చుక్కలేదు.

'చదవటానికి అందులో తనకి తెలియని విషయం ఏముంది గనుక? అది తను రాసిన ఉత్తరమేనాయె! తను రాసిన ప్రేమ లేఖే!'

"నన్ను క్షమించండి మస్టారూ!...ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాటు పని చెయ్యను" అన్నాడు చేతులు జోడిస్తూ.

"నేను నిన్ను క్షమాపణ కోరమనలేదు. అందులో ఏముందో ఒక్కసారి చదవమంటున్నాను. పైకి చదవ నవసరం లేదు. లోలోపలే చదువుకో ఫర్వాలేదు."

తను రాసిన ఉత్తరాన్ని తననే తిరిగి చదువుకోమనటంలో మస్టారి అంతర్యం ఏమిటో అర్థం కాలేదు.

వణకుతున్న చేతుల్తో కాగితం మడత విప్పాడు.

సంబోధన చూడగానే తన గుండె నెవరో పిండినట్లుగా అనిపించింది. "ప్రియమైన వసంతా!" అని ఉండడానికి బదులు "ప్రియమైన అనూరాధా!" అని ఉంది. ఆత్రతగా కిందికి చూశాడు. "నీ మోహన్" అని ఉండాల్సిన చోట "నీ రఘుపతి" అని ఉంది.

# భారత సూక్తము

పురుషుడు కర్మాధీనత
నరుగక తన వశము యనిన నాపదలు రుజల్
మరణంబును నివి యేమియు
బొరయక యుండంగ బ్రదుకబోలదె చెప్పుమా!

3-5-69

వ్యక్తి కర్మకు అధీనుడు. అందుకు సంశయం లేదు. అలా కాదు, అన్నీ తన వశంలోనే ఉన్నాయి అనుకుందాం. అలాంటప్పుడు ఆపదలు, వార్ధక్యం, మరణం-వీటిని అన్నింటినీ తప్పించుకుని బతకవచ్చుకదా!

మనిషి ఏ విషయంలోనూ స్వతంత్రుడు కాడు. అతడు అనేక విషయాలలో పరాధీనుడు- ముఖ్యంగా కర్మకు. ఇక్కడ కర్మకు 'కాలగతి' అని అర్థం చెప్పుకోవాలి. ఎంతటి ఘనుడైనా కాలానికి లొంగవలసిన వాడే. కాలాన్ని ఎదిరించిన వాడు లేడు- ఉండడు.

పద్యంలో వ్యాధుల విషయం చెప్పలేదు. వాటిని నయం చేసే వైద్యవిధానం ఉండవచ్చు. కాని, ముదిమిని ఎదిరించేది లేదు. ఇది ప్రకృతి నియమం. ముదిమిని సైతం ఎదిరించాము అనుకున్నా మరణానికి చాపు లేదు. అది తప్పదు.

అందువల్ల నరుడు కర్మాధీనుడు. కాదన్నవాడు ప్రాకృతికం అయిన మృత్యువును జయించాలి.

కర్మవశత జావె కలుగు దేహము దేహ
పతనము కర్మవశత బుట్టు
దేహపాతమైన దేహస్థుడగు జీవు
డరుగు కర్మ విహితమైన యెడకు.

3-5-70

ఈ శరీరం కర్మవల్లనే వచ్చింది. జీవితం సాంతం కర్మవశం అయింది. ఈ దేహం రాలిపోతుంది. అప్పుడు అందులోని జీవుడు కర్మ లేని చోటుకు వెళ్తాడు.

పనికీ, జీవితానికీ అవినాభావ సంబంధం ఉంది. ఒకరు చేసిన కార్యఫలితంగానే మనిషి జన్మిస్తున్నాడు. ఆ తరువాత ప్రతి నిమిషం తన ఇంద్రియ వ్యవహారంతో జీవిస్తున్నాడు. ప్రయత్నం-పని అవిరామం సాగిస్తున్నాడు. శరీరంలోని అవయవాలు, లేదా మనసు నిరంతరం పని చేస్తుంటాయి. కదలిక జీవితానికి మరొక పేరు. మనిషి జీవితం అతని ప్రవర్తన- పని కదలికమీద ఆధారపడి ఉంటాయి.

బతికి ఉన్నంత సేపూ అతడు "కర్మ"ను ఆచరించవలసిందే. బతుకు చాలించిన తరువాత కాని జీవుడు "కర్మరహితుడు" కాడు.

"క్రియ" జీవితం, "నిష్క్రియ" మరణం.

-దాశరథి రంగాచార్య

ఆ మర్నాడు మినహా మిగతా ఉత్తరమంతా తను రా సిందే!

అర్థమైంది మోహన్‌కి మస్టారి ఆంతర్యం. సిగ్గుపడిపోయాడు. పశ్చాత్తాపంతో దహించుకుపోయాడు.

"ఏం మోహన్, ఎలా ఉంది?...అదే ఉత్తరం మా రఘుపతి పుస్తకంలోగాని, మీ చెల్లెలి పుస్తకంలోగాని నీ కంట పడిందనుకో అప్పుడు నువ్వు మా రఘుపతిని ఏం చెయ్యాలనుకుంటావ్?" సౌమ్యంగా అడిగారు మూర్తిరాజుగారు.

"...."

"మాట్లాడవేం?...నువ్వేం చెయ్యాలనుకుంటావో నేనే చెప్పనా పోనీ..."

"...."

"చెప్తా విను! నరికి పోగులు పెట్టాలనుకుంటావు. నలుగురు రౌడీలతో చితక బాదించడానికి ప్రయత్నిస్తావు. ముఖాముఖీ ఎదురైతే ముఖం పగిలేలా కొడతావు. అవునా?"

నోరు పెగల్లేదు మోహన్‌కి. మస్టారంటున్న ఒక్కొక్క మాటా ఒక్కొక్క పిడుగై నెత్తిమీద పడుతున్నట్లుగా అనిపించసాగింది.

"చూడు, మోహన్! నువ్వు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా నే నన్నదాంట్లో ఒక్క అక్షరం కూడా తప్పులేదు. నిజంగా మా రఘుపతి మీ అనూరాధకి అంత అసహ్యకరమైన వర్ణనలతో అలాంటి ప్రేమలేఖ రాస్తే నువ్వు వాణ్ణి చంపటానికి కూడా వెనకాడవు. అంత ఆగ్రహమొస్తుంది. అది సహజం. కానీ, నేను నిన్ను కొట్టదలచుకోలేదు. ఇంతకన్నా ఎక్కువగా తిట్టనూ తలచుకోలేదు. ఎందుకంటే, నువ్వు నా విద్యార్థివి. నువ్వు తప్పు చేస్తే సవరించవలసిన బాధ్యత నా మీద ఉంది. అందుకే ఒకే ఒక్క మాట చెబుతున్నాను. విని బాగా అర్థం చేసుకో. నువ్వింకా విద్యార్థి దశలో ఉన్నావు. జీవితంలో ఎంతో పైకి రావాల్సిన వాడివి. ఇప్పటినుంచే ఇలాంటి జులాయి బుద్ధులు నేర్చుకుని తప్పుడు మార్గం పడితే పతనమై పోతావే తప్ప, అది నీ భవిష్యత్తుకు ఏమాత్రమూ ఉపయోగకరం కాదు. ఇప్పటికైనా నీ తప్పు తెలుసుకో. ఈ లెటర్ నా కూతురికి రాశావనే కాదు, నీ సహవిద్యార్థినుల్లో వేరెవ్వరికి రాసినా నే నీ మాటే చెప్పేవాడిని! మొదటి తప్పుగా ఇంతటితో విడిచిపెడుతున్నాను. చేసిన పనికి సిగ్గుపడి ఇక నుంచి బుద్ధిగా మసలుకో. ఇలా జరిగినందుకు నువ్వు నా వద్ద ట్యూషన్ మానేయాల్సిన అవసరం లేదు. ఇంతటితో ఈ విషయాన్ని నేను పూర్తిగా మరిచిపోతాను. ఎప్పటిలాగే ట్యూషన్‌కి రా! బాగా చదివి ఫస్టు క్లాసులో పాసవ్వాలి. తెలిసిందా? ఎ స్...యు కెన్...గో" అంటూ మోహన్ చేతిలోని ప్రేమ లేఖని తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా చించివేశారు మూర్తిరాజుగారు.

బరువెక్కిన గుండెతో లేచి నిలబడ్డ మోహన్ తల దించుకుని గడప దాటాడు. చెల్లెలు వెంటరాగా ఆ ఇంట్లోంచి మౌనంగా బయట పడ్డాడు.

** ** **

మర్నాడు పొద్దున్న ట్యూషన్‌కు అనూరాధ ఒక్కత్తే రావడం చూసి "మీ అన్నయ్య రాలేదేమమ్మా?" అనడిగారు మూర్తిరాజుగారు.

"జ్వరం, సార్!" అని అనూరాధ చెప్పగా, ముఖం చెల్లక ఆ వంకతో మానేసి ఉంటాడనుకున్నారు.

సాయంత్రం కూడా రాలేదు మోహన్.

'పాపం! పూర్ ఫెలో...బాగా భయపడిపోయినట్టున్నాడు. ట్యూషన్ పూర్తిగా మానేస్తాడో ఏమో!' అనుకున్నారు మూర్తి రాజుగారు.

కానీ, అంతలోనే "మా అన్నయ్య మీ కివ్వమన్నాడు, సార్!" అంటూ అనూరాధ ఓ కవరందించగా ఆశ్చర్యపోయారు.

"ఏంటమ్మా ఇది?"

"ఏమో, సార్, నాకూ తెలియదు."

"అందరూ ఏదో ఒకటి చదువుకుంటూ ఉండండి. ఫైవ్ మినిట్స్‌లో వస్తాను" అంటూ లోపలికి వెళ్ళి డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చుని కవరు విప్పారు మూర్తిరాజుగారు.

"దైవ సమానులైన మస్టారు గారికి,

మీ విద్యార్థి మోహన్ నమస్కరించి వ్రాయునది:

రాత్రి జరిగినదానికి నే నెంతగానో సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించవలసిందిగా మనసారా కోరుతున్నాను.

మస్టారు! నేను మీ వసంతకు రాసిన లేఖలో రెండే రెండు పేర్లని మార్చి నాతో తిరిగి చదివించడం ద్వారా నా చర్య మీ కెంతటి బాధను కలిగించిందో నాకు స్పష్టంగా అర్థమయ్యేలా చేశారు. మరోసారి వేడుకుంటున్నాను. నా తప్పిదాన్ని మన్నించండి.

మస్టారు! కాలేజీలో నన్ను రోజూ చూస్తూనే ఉన్నారు. నే నెలాంటి వాడినో మీకు తెలుసు. ఇంతవరకూ నేను ఏ విషయంలోనూ చెడ్డవాడుగా పేరు తెచ్చుకోలేదు. తొలిసారిగా రాత్రే మీతో 'జులాయి' అని ఎత్తి చూపబడ్డాను. మీ రలా అనటం సబబే. కానీ, మస్టారూ, నమ్మండి. నేను జులాయిని కాను. నేను మీ వసంతను అల్లరి పెట్టాలనికానీ, ఆమెకు వేరే విధంగా కీడు కలిగించాలని కానీ ఆ లేఖ రాయలేదు. మీ దగ్గర ట్యూషన్‌కు చేరినప్పటినుండీ వసంతని నేను ప్రేమిస్తున్నాను. ఆమెను నా జీవిత భాగస్వామినిగా చేసుకోవాలని కలలు గంటున్నాను. అసలు ప్రేమించటమే నేరమని మీ రంటే నేను చెప్పగలిగిందేమీ లేదు గాని, నేను వసంతని మనసారా ప్రేమిస్తున్న మాట మాత్రం వాస్తవం! మస్టారు! ఈ మూడేళ్ళూ నా ప్రేమని నాలోనే దాచుకున్నాను. ఏ నాడూ వసంతతో అసభ్యంగా ప్రవర్తించలేదు. ఇంకో రెండు నెలల్లో డిగ్రీ పూర్తవుతుంది. మహా అయితే ఇంక మీ దగ్గరికి మరో నెల రోజులు మాత్రమే ట్యూషన్‌కి వస్తానేమో! అందుకే ఈలోగా వసంత మనసు తెలుసుకుందామని ఆ లేఖ రాశాను. కానీ, అది వసంతకి అందించేలోగా మీ చేతిలో పడింది. నవలల్లో, కథల్లో ప్రేమ లేఖలు అలా రాస్తారు కాబట్టి నేను అలా రాశానే తప్ప అందులో అసభ్యత ఉందని మీరు చెప్పేదాకా నేను అనుకోలేదు. ఏది ఏమైనా నా నిష్కాపట్యాన్ని నిరూపించుకోడానికి నేను ఈ రోజు పొద్దున్నే మా నాన్నగారితో మాట్లాడాను. మీ వసంతని ప్రేమిస్తున్నట్లుగా చెప్పాను. నేను ఒక్కగా నొక్క కొడుకును కావటంతో నన్ను చిన్నప్పటినుంచి అల్లారుముద్దుగా పెంచారు మా నాన్న. నా మాట కాదనరన్న ధైర్యం ఉండటంవల్లే ఆయనతో అంత ధైర్యంగా నా ప్రేమ విషయం చెప్పగలిగాను. మా నాన్న ఏమన్నారో తెలుసా, మస్టారు! 'నీ ఇష్టమే నా ఇష్టం' అన్నారు. మిమ్మల్ని ఒక సారి వచ్చి మాట్లాడమన్నారు. అందరికీ ఆమోదమైతే పరీక్షలైన వెంటనే వివాహం జరిపిస్తా మన్నారు. మస్టారు! మా నాన్నగారు ఎంత స్థితిమంతులో మీకు తెలుసు కదా! పరీక్ష పాసయ్యాక నేను ఉద్యోగం కోసం వెదుక్కోవాల్సిన అవసరం లేదు. మా ఫ్యాక్టరీకి మా నాన్నగారి తర్వాత నేనే మేనేజింగ్ పార్ట్‌నర్ని. మస్టారు! మీరు నాకు కట్న కానుక లేమీ ఇవ్వవలసిన పని లేదు. వసంత ఉద్దేశం అడిగి తెలుసుకొని, ఆమెకు ఇష్టమైతే మీరు వచ్చి మా నాన్నగారిని సంప్రతించండి. ఈ విషయం ఓ కొలిక్కి వచ్చేదాకా నేను మీకు నా ముఖం చూపించ దలచుకోలేదు. అంతవరకు నేను ట్యూషన్‌కి రాను. ప్లీజ్ మస్టారు! సాధ్యమైతే రేపే వచ్చి మా నాన్నగారితో మాట్లాడండి.

ఉంటాను.
-మీ మోహన్."

తన కళ్ళను తానే నమ్మలేకపోయారు మూర్తిరాజుగారు.

మరోమారు చదివారు.

'మస్టారు! ప్రేమ పేరెత్తిన ప్రతివాడూ జులాయనే మీ పెద్ద లనుకుంటారు గాని, అలా తొందరపడకుండా నిగ్రహంతో వ్యవహరించి, నిజానిజాలు తెలుసుకోడానికి ప్రయత్నిస్తే మీ పెద్దరికం నిలబడటంతోపాటు అనేక సందర్భాల్లో ప్రేమికుల జీవితాల్లో మల్లెలు పూస్తాయి సుమా' అని మోహన్ తన కేదో పాఠం చెబుతున్నట్లుగా అనిపించింది మూర్తిరాజుగారికి.

'మోహన్! రియల్లీ యూ ఆర్ ఎ నైస్ బోయ్! వసంతా, నిజంగా! నువ్వదృష్టవంతురాలి వమ్మా!' అనుకున్నారు మనసులో.

*

